ఉపాధి పనులపై ప్రజావేదిక

- వివరాలు వెల్లడించిన సిబ్బంది
- అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం.. డీఆర్డీవో సురేందర్



ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్డీవో సురేందర్

రామారెడ్డి : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ సామాజిక తనిఖీ చేపట్టిన నివేదికలపై మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్డీవో సురేందర్ సమక్షంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన నివేదికలను గ్రామాల వారీగా డీఆర్పీలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా చేపట్టాలని ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్అసిస్టెంట్లను ఆదేశించారు. గ్రామాల వారిగా ఏడాదిలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. గొల్లపల్లిలో నర్సరీ నిర్లక్ష్యంగా ఉందని ఉపాధి తనిఖీ బృందం గుర్తించింది. ఉపాధి హామీ గ్రామసభలు ఎందుకు నిర్వహించడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ రజితపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీకి సంబంధించిన రికార్డులు సరిగా లేవని, చేసిన పనుల్లో.. కొలతల్లో తేడాలు ఉన్నాయని గుర్తించారు. అంతేకాకుండా నలుగురు ఉపాధి హామీ పనిచేయకుండా వారి ఖాతాల్లో రూ 8, 150 జమ చేశారని తనిఖీ బృందం నిర్ధారించారు. ఈసీ జగదీశ్వర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ పనులను ఎందుకు పర్యవేక్షించడం లేదంటు ప్రశ్నించారు. ఎంపీడీవో సైతం పనులను పరిశీలించాలన్నారు. గ్రామాల్లో పనులు చేసిన కూలీలకు డబ్బులు రాకపోవడం, కొన్నిచోట్ల పనులు చేయని వారికి ఖాతాల్లో డబ్బులు జమ కావడంపై సంబంధిత అధికారుల నుంచి బాధ్యత వహించి డబ్బులను రికవరీ చేయిస్తామని పేర్కొన్నారు. సింగరాయపల్లిలో కొందరు 93 రోజులు పని చేయకుండా పనులు చేసినట్లు హాజరు వేసి వారి ఖాతాల్లో రూ.38,752 జమ చేసినట్లు నిర్ధారించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మన్ శ్రీనివాస్‌రావు, ఎస్‌క్యూసీవో రాఘవన్, జేక్యూసీ విప్లవకుమార్, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, సవితారెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, సోషల్ ఆడిట్ సీఆర్పీ కవిత పాల్గొన్నారు.

కుటుంబాలను వేరు చేసిన 'ఉపాధి హామీ'

నిరుపేదలకు ఉపాధి కల్పించాల్సిన జాతీయ ఉపాధి హామీ పథకం భార్యాభర్తలను, ఓ కుటుంబంలోని ముగ్గురిని వేరు చేసింది. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఈ విషయం వెలుగు చూసింది. మండలంలోని జగదాంబ తండాలో ఓ కుటుంబానికి ఒకే జాబ్ కార్డు ఇవ్వాల్సింది పోయి భార్యను భర్తను వేర్వేరు చేస్తూ ఇద్దరికి జాబ్ కార్డులు ఇచ్చినట్లు తనిఖీల్లో బయట పడింది. అలాగే అదే తండాకు చెందిన భర్త శంకర్, భార్య లలిత, కుమార్తె గంగోత్రికి వేర్వేరుగా మూడు ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఉన్న అధికారుల ఆదేశాల మేరకు కుటుంబంలో నలుగురు ఉంటే తల్లిదండ్రులకు ఒకటి, కుమారుడు కోడలికి మరొకటి ఇస్తే పని రోజుల సంఖ్య పెరిగి కూలీలు లబ్ధిపొందుతారనే ఉద్దేశంతో తాము విధుల్లో లేని సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించిన కార్యదర్శులే జాబ్‌కార్డులను పెంచినట్లు ఎఫ్ఏలు పేర్కొన్నారు. భార్యాభర్తలను విడదీసి ఎలా జాబ్ కార్డులు ఇస్తారని డీఆర్డీవో అధికారులను ప్రశ్నించారు.

శ్మశాన వాటికకు నివేదికలు ఇచ్చాం

రామారెడ్డి: రామారెడ్డి మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గ్రామంలో మరో శ్మశాన వాటిక ఏర్పాటుకు నివేదికలు తయారు చేసి పంపినట్లు డీఆర్డీవో సురేందర్ పేర్కొన్నారు. త్వరలోనే స్థల సేకరణ చేసి వైకుంఠ ధామం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

కోళ్ల యూనిట్‌తో అధిక లాభాలు



కోళ్ల యూనిట్‌ను పరిశీలిస్తున్న డీపీఎం

రాజంపేట: మహిళా సంఘాల సభ్యులు కోళ్ల యూనిట్‌తో అధిక లాభాలు పొందవచ్చని డీపీఎం వకుళ అన్నారు. రాజంపేట మండలం ఆర్గోండ గ్రామంలోని 'మహిళా శక్తి'లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న పథకం పెరటి కోళ్ల మదర్ యూనిట్ (నాటు కోళ్ళ)ను శనివారం సందర్శించారు. లబ్ధిదారులు తుల మమత, తుల భూలక్ష్మి యూనిట్‌లను సందర్శించి వారికి తగు సూచనలు అందించారు. 45 రోజుల కోడి పిల్లలు 60 గ్రాములు బరువుతో ఉంటాయని తెలిపారు. డిసెంబర్ నాటికి ఇవి కేజీకి పైగా అయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అప్పుడు వీటి ధర సుమారు రూ. 600 వరకు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజేందర్, సాయిలు, సీసీ సాయిలు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

బిచ్కుంద: మండలంలోని గోపన్‌పల్లి సమీపంలో ఉన్న స్టోన్ క్రషర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు ఐటీఐ కళాశాలను సందర్శించడానికి వచ్చిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. క్రషర్ నిర్వాహకులు బ్లాస్టింగ్ చేస్తుండడంతో ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, దుమ్ముతో గ్రామంలో చాలా మంది శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. ఈ విషయమై గతంలో అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టాలని మైన్స్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

భిక్కనూరు: రైతు పక్షపాతి అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, వెంటనే ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో తూకాలు చేపట్టాలని బీఆర్ఎస్ భిక్కనూరు మండల నేతలు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి పది రోజులు గడుస్తున్నా ఇంకా తూకాలు చేపట్టక పోవడం సిగ్గు చేటని అన్నారు. రైతులను అనేక రకాలు మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించేందుకు ప్రజలు, రైతులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్లు నాగార్తి భూంరెడ్డి, అలకొండ వెంకట్‌రెడ్డి, ఎస్ను వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, సీనియర్ నేతలు అందె మహేందర్‌రెడ్డి, వంగెటి చిన్ననర్సారెడ్డి, తక్కళ్ల రవీందర్‌రెడ్డి, జిల్లెల రవీందర్‌రెడ్డి, రాజయ్య ఉన్నారు.



తాడ్వాయిలో మూసిఉన్న దుకాణాలు

బంద్ ప్రశాంతం

తాడ్వాయి: ఆలయాలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల నాయకులు మండల కేంద్రంలో చేపట్టిన బంద్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. దుకాణదారులు, హోటళ్ల, ఇతర ప్రైవేటు సంస్థలు స్వచ్ఛందంగా మూసి ఉంచారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



నాగిరెడ్డిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట: హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం తలపెట్టిన నాగిరెడ్డిపేట మండల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి వ్యాపారులు వారి దుకాణాలను మూసివేసి బంద్‌కు సహకరించారు. యువకులు ర్యాలీ చేపట్టి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన



ఎల్లారెడ్డి: పట్టణంలోని పలు కాలనీల్లో వేయాల్సిన సీసీ రోడ్డుకు సంబంధించిన స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ శనివారం పరిశీలించారు. పట్టణంలోని 8, 9, 10వ వార్డుల్లో వేయాల్సిన సీసీ రోడ్డుకు సంబంధించిన స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట ఏఈ వినోద్, కౌన్సిలర్ నీలకంఠం, నాయకులు నునుగొండ శ్రీనివాస్, తిరుపతి తదితరులు ఉన్నారు.

లింగంపేటలో భూములు..

లింగంపేట: మండల కేంద్రంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల భూములను ఎంపీవో మలహరి శనివారం పరిశీలించారు. 2020లో ల్యాండ్ రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల ప్లాట్లను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో 1100 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట బట్టు సాయిలు, జీపీ సిబ్బంది ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



ఆరేడ్‌లో సభ్యత్వ నమోదు చేయిస్తున్న లక్ష్మారెడ్డి

నిజాంసాగర్: మండలంలోని ఆరేడ్‌లో గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రామ్, నరేశ్, పవన్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

జప్తిజాన్కంపల్లిలో..

నాగిరెడ్డిపేట: గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడి ఎల్లారెడ్డి సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజాన్కంపల్లిలో శనివారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హన్మాండ్లు, రాజు, గోపాల్, విష్ణు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే టీ-సేఫ్ యాప్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని పోలీస్‌శాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ సంయుక్తంగా 'టీ-సేఫ్' యాప్‌ను రూపొందించిందని షీం టీం, పోలీస్ కళాబృందం సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని కేజీబీవీలో శనివారం సైబర్ నేరాలతోపాటు మహిళలపై జరిగే వేధింపుల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్‌నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ప్రభాకర్, శేషారావు, సాయిలు, కేజీబీవీ ప్రిన్సిపాల్ గీత తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



సదాశివనగర్: మండలంలోని మోడల్ స్కూల్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై బాలికలకు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మా అఫ్రిన్ అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, కార్యదర్శి కమలాకర్‌రావు, ట్రెజరర్ శ్రీనివాస్, డైరెక్టర్లు రాజేందర్, జనగామ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ విధులపై అవగాహన



పెద్దకొడప్‌గల్: పోలీస్ విధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఏఎస్సై రాములు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక పీఎస్‌లో పోలీస్ విధుల నిర్వహణ గురించి శనివారం అవగాహన కల్పించారు. నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది సాయి, శివ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నీటిని క్లోరినేషన్ చేయాలి

ఎల్లారెడ్డిరూరల్: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని నీటి ట్యాంకులను శనివారం పరిశీలించారు. తాగునీటిని క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. కౌన్సిలర్ నీలకంఠం, కాంగ్రెస్ నాయకులు నునుగొండ శ్రీనివాస్, తిరుపతి తదితరులు ఉన్నారు.

అనుమతులు తీసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసే వారు తప్పకుండా అనుమతులు తీసుకోవాలని ఎస్సై మహేశ్ అన్నారు. టపాకాయల దుకాణాదారులు జనావాసాలకు దూరంగా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ డీఎంపై విచారణ చేపట్టాలి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌పై విచారణ చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు, ప్రముఖ న్యాయవాదులు జగన్నాథం, సిద్ధిరాములు, నర్సింహారెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఎం అక్రమాలు, కార్మికులపై వేధింపులపై ఆర్టీసీ యాజమాన్యానికి నెల రోజుల క్రితం ఫిర్యాదు చేస్తే కేవలం ఆర్టీసీ సీఐపై విచారణ చేపట్టడం సరైంది కాదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ యూనియన్ వార్షికోత్సవం



కామారెడ్డి టౌన్: ఐఎన్‌టీయూసీ(327)విద్యుత్ యూనియన్ 70వ వార్షికోత్సవ వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, శ్రీధర్, మోహర్‌బాబా, రాజారెడ్డి, గోపాల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా



కామారెడ్డి టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో కలిసి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాహుల్, సమీర్, నితిన్, నవీన్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ పండుగ



పెద్దకొడప్‌గల్: మండలంలోని వడ్లం గ్రామంలో ముత్యాల పోచమ్మ పండుగను గ్రామస్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటికొకరు బోనం తీసి ప్రధాన వీధుల గుండా ఊరేగింపి అమ్మవారికి సమర్పించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, అందరూ సంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శామప్ప పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమ్యూటేషన్ పెన్షన్ రికవరీ చేయొద్దని వినతి



కామారెడ్డి అర్బన్: కమ్యూటేషన్ పెన్షన్ రికవరీ చేయొద్దని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా ట్రెజరీ అధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల నుంచి అక్టోబర్ నుంచి కమ్యూటెడ్ పెన్షన్‌ను కోత కోయరాదని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల కాపీని డీటీవోకు అందించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.హన్మంతురెడ్డి, కార్యదర్శులు ఎన్ నర్సింహారెడ్డి, సత్తయ్య, రవీందర్ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నస్రుల్లాబాద్: బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతుల ఖాతాల్లో డబ్బులు పడే సమయం కనుక ఎవరికీ ఖాతాల వివరాలు, ఓటీపీలు చెప్పొద్దని సూచించారు. బ్యాంకు నుంచి డబ్బులు తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది హరిచంద్, వెంకటేశ్ ఉన్నారు.

క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



బీబీపేట: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి సతీశ్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని మాందాపూర్‌లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అంతే కాకుండా స్థానిక అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో కృష్ణ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బాన్సువాడ: పట్టణంలోని గాంధీచౌక్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ శనివారం పరిష్కరించారు. 16వ వార్డులో కొన్ని రోజులుగా పైపులైన్ మూసుకుపోవడంతో కాలనీలో తాగునీటి ఇబ్బంది ఏర్పడింది. దీంతో కాలనీవాసులు మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిచే పైపులైన్ మరమ్మతులు చేయించారు. దీంతో కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఆయన వెంట వార్డు ఇన్‌చార్జి నార్ల ఉదయ్ తదితరులు ఉన్నారు.

సీఎస్సార్ నిధులపై దరఖాస్తు



భిక్కనూరు: మండల కేంద్రంలోని జీపీకి పలు కంపెనీల నుంచి వచ్చిన సీఎస్సార్ నిధుల వివరాలను తెలుపాలంటూ సమాచారహక్కు పరిరక్షణ కమిటీ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ శనివారం ఈవో మహేశ్‌గౌడ్‌కు దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘం నేతలు కర్రోళ్ల రాజు, రమేశ్ పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని 34వ వార్డులో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వార్డు సభ్యులు శనివారం మున్సిపల్ కమిషనర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. శానిటేషన్, ఇంటింటా చెత్త సేకరణ, వీధి దీపాలు, కుక్కలు, కోతుల బెడద, పార్కు నిర్వహణ, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, నీటి సరఫరాలో అంతరాయం, పలు సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ఆకుల భరత్, సత్యనారాయణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కామారెడ్డి టౌన్: చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన సబ్బని కృష్ణహరిని పద్మశాలీ సంక్షేమ సంఘం సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పండరి, కార్యదర్శి రాజయ్య, ఉపాధ్యక్షుడు అర్జున్, నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



మాచారెడ్డి: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన పాల్వంచ మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని ప్రణీతను హెచ్ఎం గోవర్ధన్ శనివారం అభినందించారు. ఈనెల 17న నందిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ అతీఖుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత



ఎల్లారెడ్డిరూరల్: మండల కేంద్రంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న నలుగురికి ఫోన్లను అందించినట్లు ఎస్సై మహేశ్ శనివారం పేర్కొన్నారు. ఎల్లారెడ్డికి చెందిన వాజిద్ పాషా, ఉప్పరి సాయిలు, అనిల్‌కుమార్, కలీమొద్దీన్ ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫోన్ల ఆచూకీని కనుగొని బాధితులకు అందించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్తం

సీఎంను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే



నిజాంసాగర్: హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ఏఐజీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో కలిసి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హాస్పిటల్స్ వారు అందిస్తున్న సేవలను సీఎం కొనియాడారు

ఉపాధ్యాయులకు సన్మానం

నిజాంసాగర్: మండలంలోని వెల్గనూర్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తించి పదోన్నతిపై వెళ్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అచ్చంపేట సొసైటీ చైర్మన్ కయ్యం నర్సింహారెడ్డి, నాయకులు ఆనంద్ కుమార్, సంపత్‌రెడ్డి, అచ్చంపేట కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత సామగ్రి వేలం

గాంధారి: మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో ఉన్న పాత సామగ్రికి శనివారం వేలం నిర్వహించినట్లు కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఎంపీడీవో రాజేశ్వర్ సమక్షంలో వేలం వేయగా టేకు యశోద రూ. 50 వేలకు దక్కించుకున్నట్లు కార్యదర్శి పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



ఎల్లారెడ్డిరూరల్: సబ్దల్‌పూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో శనివారం చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామస్తులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్, కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దకొడప్‌గల్: ఐటీఐ కోర్సులకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ దశరథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిచ్కుందలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో రెండేళ్ల పాటు ఆరు కొత్త కోర్సులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టాటా గ్రూప్ సహాయంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నామని, ఉద్యోగ అవకాశాలు కూడా తొందరగా వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 96402 28856, 9866757695 నంబర్లను సంప్రదించాలన్నారు.

పలువురికి పరామర్శ

నాగిరెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడి ఎల్లారెడ్డి పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీఎంపీపీ రాజ్‌దాస్, పార్టీ నాయకులు ఉన్నారు.